క్లుప్తంగా

బడ్జెట్‌లో చేనేతలను ప్రభుత్వం విస్మరించింది



మంగళగిరి: ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా నిలువునా మోసం చేసిందని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్‌ను రూ.3 లక్షల కోట్లతో ప్రవేశపెట్టి చేనేత పరిశ్రమకు ఒక్క రూపాయి కేటాయించకుండా మొండి చేయి చూపడం దుర్మార్గమన్నారు. చేనేతల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ బూటకపు మాటలు చెబుతున్నారన్నారు. చేనేత పరిశ్రమకు రూ.రెండు వేలు కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించకపోతే చేనేత కార్మిక సంఘం ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మంగళగిరి: పట్టణంలోని భార్గవపేట సీతారామ క్షేత్రంలో కార్తిక ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 75 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు పూజా ద్రవ్యాలను ఉచితంగా అందజేశారు. అర్చకులు ఆర్.నాగరాజు శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి శ్రీరామమూర్తి, గోలి తులసీనాథ్ ప్రసాద్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

తాడికొండ: తల్లి, తాత మందలించారని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ మండలం రావెల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రావెల గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు (19) బాధ్యత లేకుండా తిరుగుతుండటం, మద్యం తాగి సమయానికి ఇంటికి రాకుండా వ్యవహరిస్తుండటంతో తల్లి, తాత మందలించారు. ఈ నెల 9వ తేదీ మద్యం తాగి రావడంతో తల్లి బండి మల్లేశ్వరి, తాత వరగాని సాంబశివరావులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన యువకుడు అదే రోజు రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా 12వ తేదీ తెల్లవారుజామున మరణించాడు. మృతుడి తల్లి బండి మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

వెబ్‌సైట్ తెరుచుకునేదెప్పుడో..!?

- ప్రభుత్వ పథకాల కోసం తప్పని నిరీక్షణ
- పనిచేయని వెబ్‌సైట్‌లు
- వెలవెలబోతున్న గ్రామ, వార్డు సచివాలయాలు



సచివాలయం

తాడేపల్లిరూరల్: ప్రభుత్వ పథకాలైన పింఛన్లు, రేషన్ కార్డుల కోసం లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు, పింఛన్లు, పక్కా గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేసే ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వ వెబ్‌సైట్‌లు కూడా పనిచేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలకు, పాలనకు పొంతన లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామ స్వరాజ్యాన్ని సాధిస్తామంటూ గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ సక్రమంగా సాగేందుకు అవసరమైన ఉద్యోగులను నియమించింది. మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో అందించే సేవలన్నింటినీ సచివాలయాల పరిధిలోకి తీసుకువచ్చింది. గత ఐదేళ్ల కాలంలో ఏ పని కావాలన్నా ప్రజలు సచివాలయాన్నే ఆశ్రయించేవారు.

పనిచేయని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం వచ్చాక అవాంతరాలు తప్పడం లేదు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వెబ్‌సైట్లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. పట్టణ, పల్లెల్లో ప్రజలకు మాత్రమే సత్వరమైన సమస్యలు పరిష్కారం అయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం ఉపయోగకరంగా లేవనే భావన సర్వత్రా వినిపిస్తోంది. ముఖ్యంగా వెబ్‌సైట్లు పనిచేయకపోవడంతో ఆరోగ్య శ్రీలో వైద్య సేవలు పొందే రోగుల బాధలు వర్ణనాతీతం. కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలకు నిరాకరిస్తున్నారు. వయస్సు, అర్హత ఉన్నా ఇంటి స్థలం, పింఛన్లు, రేషన్ కార్డు, పక్కా గృహాల కోసం దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

అసహనంలో ప్రజలు

మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి పట్టణ రూరల్ ప్రాంతంలో 20, మంగళగిరి పట్టణ రూరల్‌లో 24, దుగ్గిరాల మండల పరిధిలో 18 సచివాలయాలు ఉన్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 545 రకాల సేవలు అందించేవి.

- కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి సర్కార్ అధికార పగ్గాలు చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు నమోదుకు చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.
- పథకాలకు సంబంధించిన వెబ్‌సైట్‌ల పనిచేయకపోవడంతో ప్రజలు రేషన్ కార్డులు, పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. గతంలో ఏ పనికైనా సచివాలయాలకు వెళ్లే పరిస్థితి ఉండడంతో సందడిగా కనిపించేవి. ప్రస్తుతం ఆ వాతావరణం కనిపించడం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తున్న ప్రజలకు సచివాలయ సిబ్బంది నుంచి వెబ్‌సైట్లు పనిచేయడం లేదనే సమాచారం తప్ప ఇంకేమీ రావడం లేదు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఆరు నెలలు కావస్తోంది. పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ పంపిణీ మినహా మరే ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదు

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడేది కాదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) విమర్శించారు. మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట పార్టీ కార్యాలయంలో మంగళవారం డీవీఆర్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గందరగోళంగా ఉందన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ప్రభుత్వం అయితే గడచిన ఐదు నెలల్లో ఎందుకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే అన్ని సంక్షేమ పథకాలు అమలులో ఉండేవని ప్రతి పేదవాడు సంతోషంగా జీవించేవాడన్నారు. పథకాలకు పెట్టాల్సిన డబ్బును పక్కదారి పట్టించి దోచుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. గ్లోబల్ ప్రచారాన్ని బాగా నమ్మే చంద్రబాబు ఒక అబద్ధాన్ని పదిసార్లు చెప్పి నిజమని నమ్మించే వ్యక్తి అన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని చెప్పి వారిని నిలువునా మోసం చేశాడన్నారు. ప్రభుత్వంపై ప్రజలలో చైతన్యం కలిగించే సోషల్ మీడియాపై తప్పుడు కేసులు పెట్టి సోషల్ మీడియా గొంతును నొక్కేస్తుందన్నారు. ప్రజలకు ఈ కూటమి ప్రభుత్వంపై నమ్మకం పోయి జమిలి ఎన్నికలు వస్తే ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపవచ్చని కోరుకుంటున్నారన్నారు. జమిలి ఎన్నికలయినా ఏ ఎన్నికలు జరిగినా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 137 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు శాంతి మాట్లాడుతూ శీతాకాలం కావడంతో జలుబు, దగ్గు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని దానితో పాటు జ్వరాలు వస్తాయని తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వాటి నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం వంటివి వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా దగ్గరలోని హెల్త్ సెంటర్లో చూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ భూముల్లో కంకర డంపింగ్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్డులోని కుడి భాగంలో ఉన్న జిల్లా పరిషత్ భూముల్లో రాత్రికి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంకర, డస్ట్ తోలించారు. మంగళవారం తెల్లవారుజామున పంట పొలాలకు వెళ్లే రైతులు ఆ కంకర గుట్టను చూసి చుట్టు పక్కల వారిని విచారించగా ఎవరిది కాదని తెలియజేశారు. గత ప్రభుత్వంలో కూడా జెడ్పీ భూముల్లో రహదారి కోసం కొంత మంది ఆక్రమణలు చేసేందుకు ప్రయత్నించారని మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన సంఘటనపై 24 ఎకరాల భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ భూముల్లో కొన్ని భూములు ప్రైవేటు వారివి కావడంతో వెళ్లేందుకు అనుమతులు లేకపోవడంతో ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని, ఇప్పటికే కోర్టు జెడ్పీ భూముల్లో రైతులెవరిని ఇబ్బంది పెట్టవద్దని తీర్పు ఇచ్చినట్లు పలువురు రైతులు తెలిపారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తాడికొండ: ఈ నెల 14వ తేదీ నుంచి తాడికొండ శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖుల పాత్ర, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న బహుమతుల ప్రదానం కార్యక్రమాలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు పాల్గొని వారోత్సవాలలో తమ ప్రతిభను చాటాలని సూచించారు.

తాడేపల్లిరూరల్: నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి నాగూర్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాచరచన, వకృత్వం, చిత్రలేఖనం, క్విజ్, తదితర పోటీలు, అవగాహన సదస్సులు, పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నామని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందని, విద్యార్థులందరూ పాల్గొనాలని నాగూర్ బాషా కోరారు.

మేడికొండూరు: స్థానిక మేడికొండూరు శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి సుధారాణి మంగళవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. పాఠకులు, విద్యార్థులు ఈ వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మంగళగిరి: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ శాఖ అధికారి ఎస్.ఆరోగ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు, మహిళలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు పుస్తక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రజలు, పాఠక ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోటి దీపోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం) కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన మణిదీపం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే కోటి దీపోత్సవ కరపత్రాలను ఆలయ ఆవరణలో మంగళవారం ఆవిష్కంచారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు మునగపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవిత్రమైన కార్తిక పౌర్ణమి రోజు కోటి దీపోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బుద్దంటి రవికిరణ్, టి శ్యాంసుందరశాస్త్రి, కొల్లి బాబూరావు, అద్దంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదాయ సామర్థ్యం పెంచుకోవాలి



ఫిరంగిపురం: బ్యాంకు ఖాతాదారులు పొదుపులో పంచసూత్రాలు పాటించడంతో పాటు కుటుంబ పోషణ కోసం ఆదాయ సామర్థ్యం పెంచుకోవాలని డ్వాక్రా మండల ఏపీఎం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం రిజర్వుబ్యాంకు, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు చేయడంలో దేశంలోనే డ్వాక్రా సంఘాలు ముందంజలో ఉన్నాయని చెప్పారు. ల్యాంపు సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్‌బీమా యోజన, సురక్ష యోజన బీమా కలిగి ఉండాలన్నారు. జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం ఇమ్మానియేలు, సంస్థ రిసోర్స్ పర్సన్ కె.వెంకటేశ్వరరావు, కె.సుదర్శన్‌రాజు, డ్వాక్రా సీసీ రమాదేవి, విజయభాస్కర్, మంగయ్య, బ్యాంకు ఖాతాదారులు, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై సర్వేను విజయవంతం చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జయరామకృష్ణ, డాక్టర్ గిరిధర్‌కుమార్

ఫిరంగిపురం: ఎన్‌సీడీసీడీ సర్వేను ఆరోగ్యసిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్‌సీడీసీడీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జయరామకృష్ణ చెప్పారు. సచివాలయం-1 పరిధిలో ఎన్‌సీడీసీడీ సర్వే (ట్రయల్‌రన్)ను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీసీడీ (అసంకృతవ్యాధులు)పై సర్వేను ఆరోగ్యసిబ్బంది నిర్వహిస్తారని చెప్పారు. సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట ఎన్‌సీడీసీడీ జిల్లా కన్సెల్‌టెంట్ డాక్టర్ గిరిధర్, సీహెచ్‌వో వెంకటరమణ, ఆరోగ్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన కలెక్టర్



మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సంతృప్తిని వ్యక్త పరిచారు. అనంతరం అధ్యాపకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అపార్ ఐడీలు, రికార్డుల కోసం యూనిక్ ఐడీని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 70 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు స్కూల్ రికార్డులలో, ఆధార్‌లో ఉన్న డేట్ ఆఫ్ బర్త్ కొందరిలో సరిపోకపోవడంతో సర్వే నెమ్మదించిందని తెలిపారు. విద్యార్థుల డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ల జారీ కోసం అన్ని శాఖలు సమన్వయంగా పనిచేస్తే త్వరితగతిన పూర్తి చేయవచ్చన్నారు. అనంతరం పేరేచర్లలో ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ కింద పైలట్ ప్రాజెక్టుగా రూ.5.50 లక్షల రుణంతో ఏర్పాటు చేసిన శ్రీ విజయలక్ష్మి ఫ్యాన్సీ అండ్ బుక్ స్టోర్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సచివాలయ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సర్వే చేస్తున్న సిబ్బందికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులతో పాటు తహసీల్దార్ కే కళ్యాణి, ఎంపీడీవో చందన, మండల విద్యాశాఖ అధికారి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి: తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, హరియాణా రాష్ట్రాలలో చేసిన విధంగా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ రంగాలలో ఎస్సీలు అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబాబు చెప్పినట్లు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే తీవ్ర నష్టం జరుగుతుందని తక్షణమే ఆ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీన విజయవాడలో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో ఏ బి సి డి వర్గీకరణ విషయమై పూర్తి స్థాయిలో చర్చించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలువూరు నాగరాజు, కొమ్మూరి గరటయ్య, ఈపూరి ఆదామ్, కట్టిపోగు బాబూరావు, పులి దాస్, ఏటుకూరి విజయ్‌కుమార్, కొమరాల శ్రీనివాసరావు, భూషణం, నవీన్, పులి ప్రభుదాసు, కుక్కమళ్ళ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపోరు ప్రచార కార్యక్రమంలో దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ కొలనుకొండలో కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిందని అందులో భాగంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పారని కానీ ధరలు తగ్గించలేదని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరైన విధానం కాదని అన్నారు. తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు, చేతి వృత్తులు చేసుకునే వివిధ వర్గాల ప్రజలకు పనులు కల్పించాలని, ఇసుకను అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, గబ్బర్, ముస్లిమ్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి



లేఅవుట్ ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మేడికొండూరు: గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. పేరేచర్ల సమీపంలోని గుంటూరు అర్బన్ హౌసింగ్ లే-అవుట్‌ను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లే-అవుట్‌లో పీఎంఏవై ద్వారా మంజూరైన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మార్చి తరువాత కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు రావని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో వెనుకబాటుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అప్రోచ్ రోడ్డు, నిర్మాణాలకు నీరు, గ్రావెల్ అవసరమని కలెక్టర్ దృష్టికి కాంట్రాక్టర్లు తీసుకువెళ్లారు. మెటీరియల్ కాస్ట్ పెరిగిందని చెప్పడంతో తక్కువ రేటుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. లే-అవుట్‌లో వీధిలైట్లు లేవని విద్యుత్ శాఖ పరికరాలు చోరీకి గురయ్యాయని, కేసు నమోదు చేశామని విద్యుత్ శాఖ డీఈ రమేష్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. లే-అవుట్‌లో రాత్రి వేళల్లో గ్రావెల్లో ఇసుక చోరీకి గురవుతున్నాయని చెప్పారు. పహారా ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎలక్ట్రికల్ డీఈ చల్ల రమేష్, సివిల్ సప్లయ్స్ డీడీ దేవరాజు, డీఈఓ సి.వి.రేణుక, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మేడికొండ తహసీల్దార్ కళ్యాణి, ఎంపీడీవో చందన పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి ఆయన విచ్చేసి మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 170 మంది కార్మికులు మరణించారని, యాజమాన్యం ఇప్పటికీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, బి.అంకయ్య, సాంబయ్య, ఎం.ఆశీర్వాదం, నవనీతం, రమాదేవి, శారద, కె.ఆదినారాయణ, కృష్ణ, రమణ, జ్యోతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 91699 22299

WANTED

■ నూతనంగా ప్రారంభించిన బ్యాంక్ అనుబంధ సంస్థ నందు పనిచేయుటకు VRS, Rtd, వ్యాపారస్తులు కావలెను. జీ+ESI+PF+ఇన్సెంటివ్స్ -75000/- 7013481406

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818892.

■ Montessori EM School Lakshmipuram, Guntur. Requires Teachers and Incharges. Cont: 6305028254

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 8073902428

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ &క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం. Loc: గుంటూరు. 89196 13904.

■ నెల్లూరు జిల్లా ప్రముఖ పవర్ ఇండస్ట్రీ నందు పర్మినెంట్‌గా పని చేయుటకు Ex-ARMY గార్డ్స్ కావలెను. 8గం॥ డ్యూటీ,జీతం : 34,000/- ఉచిత వసతి కలదు.77999 27624, 77999 27609.

■ బిజినెస్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై నైపుణ్యం, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, రెజ్యూములను hoadvtjobs@gmail.comకు పంపగలరు.

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ఫోన్: 9160090024, 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్

గుంటూరు

7075167541
7075167663

గమనిక

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com